క్లుప్తంగా

నర్సింగ్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

సత్తుపల్లి: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల సత్తుపల్లికి మంజూరు చేసిన నర్సింగ్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.బి.జోత్స్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో 60 సీట్లు ఉండగా ఎంసెట్‌లో ర్యాంకుల ఆధారంగా 38 సీట్లు భర్తీ చేశామని, మిగిలిన 22 సీట్లను ఎంసెట్‌లో క్వాలీఫై అయిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 8వ తేదీ నుంచి 12వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

నేడు భారీగా నామినేషన్లు

వైరా: వైరా అసెంబ్లీ నియోజకవర్గానికి నేడు ప్రధాన పార్టీల నాయకులు నామినేషన్లు వేయనున్నారు. అధికార బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బాణోత్ మదన్‌లాల్ గురువారం గంటలకు నామినేషన్ వేయనున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ అభ్యర్థి మాళోత్ రాందాస్ నాయక్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. బీజేపీ మద్దతు ఇస్తున్న జనసేన తరుపున కూడా నామినేషన్ వేసే అవకాశం ఉందని తెలుస్తుంది.

సత్తుపల్లి: బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సండ్ర వెంకటవీరయ్య గురువారం ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. మట్టా రాగమయి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ర్యాలీగా వచ్చి మరో నామినేషన్ దాఖలు చేయనున్నారు. బీజేపీ అభ్యర్థి నంబూరి రామలింగేశ్వరరావు 12 గంటలకు నామినేషన్ వేయనున్నారు.

బోనకల్: సీపీఐ బలపరిచిన మధిర కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క నామినేషన్ కార్యక్రమానికి సీపీఐ శ్రేణులు భారీగా తరలిరావాలని పార్టీ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కోరారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, సహాయ కార్యదర్శులు రామారావు, పవన్, ఏనుగు రవికుమార్, భద్రం పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మధిర అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా లింగాల కమల్‌రాజ్ మధిర పట్టణంలో గురువారం నామినేషన్ వేయనున్నారని పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు పంబి సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి యన్నం శ్రీనివాసరెడ్డిలు ఒక ప్రకటనలో కోరారు.

బీటెక్ ఫలితాల్లో 'సాయిస్ఫూర్తి' ప్రతిభ

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు బీటెక్ రెండో సంవత్సరం ఫైనల్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. వివిధ విభాగాల విద్యార్థులు వి.అనూష, పి.కృష్ణారెడ్డి, ఆర్.శ్రీనివాస్, కె.భవ్యశ్రీ, డి.శ్రీనివాసరావు, కె.చంద్రిక 8.52, జి.స్వాతి, సీహెచ్.కావ్య, హేమంత్‌సింగ్, బి.గాయత్రి, ఎం.కీర్తిప్రియ, డి.మోక్షిత్, సీహెచ్.స్వాతి ఉత్తమ ఎస్‌జీఈపీఏ సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి తెలిపారు. ఈమేరకు విద్యార్థులను ఎంపీ, కళాశాల చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద, సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, చీఫ్ కౌన్సిలర్ జవహర్ తదితరులు అభినందించారు.

సభ్యత్వ రద్దును విరమించుకోవాలి

కారేపల్లి: మండల పరిధిలోని గేటుకారేపల్లి, రేగులగూడెం, రామకృష్ణాపురం గ్రామాలకు చెందిన మత్స్యసొసైటీలో సభ్యత్వ రద్దును విరమించుకోవాలని, తిరిగి సొసైటీలో చేర్చుకోవాలని కోరుతూ మత్స్యకారులు ఖమ్మంలోని మత్స్యశాఖ ఏడీ ఆంజనేయస్వామికి బుధవారం వినతిపత్రం అందజేశారు. దీంతో మత్స్యశాఖ ఏడీ స్పందిస్తూ ఎన్నికల కోడ్ అనంతరం పాత మత్స్యసొసైటీలో ఉన్న సభ్యత్వాలను యథావిధిగా కొనసాగిస్తామన్నట్లు మత్స్యకారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యసొసైటీ అధ్యక్షులు తురక సాంబయ్య, సభ్యులు పిట్టల సత్యనారాయణ, రెడ్డిబోయిన చినవెంకన్న, తురక నారాయణ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలు

చింతకాని: దివ్యాంగ పిల్లల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఫిజియోథెరపీ వైద్యులు వల్లూరి వసంత తెలిపారు. మండల పరిధిలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో మండల విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో ప్రత్యేక అవసరాలు కల్గిన దివ్యాంగ పిల్లలకు బుధవారం ఫిజియోథెరపి వైద్యసేవల్ని నిర్వహించారు. ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, భవిత కేంద్రం సంరక్షురాలు అరికొట్ల లలితకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రై సైకిల్ పంపిణీ

మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలోని భవిత కేంద్రంలో తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్, ఎలిమికో అలింకో సహకారంతో ప్రత్యేక అవసరాలు కల్గిన చిన్నారులకు మూడు చక్రాల సైకిల్, వినికిడి యంత్రాన్ని పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి, రాంబాబు, డాక్టర్ వల్లూరి వసంత, ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, లలితకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన భద్రత



భద్రతా వలయంలో స్ట్రాంగ్‌రూమ్‌లు

- మూడంచెలుగా పటిష్టమైన బందోబస్తు
- సీసీ కెమెరాలతో నిరంతర నిఘా



సత్తుపల్లిలో స్ట్రాంగ్‌రూమ్ భవనానికి ఏర్పాటుచేసిన ఫెన్సింగ్ (ఇన్‌సెట్‌లో) సీసీ కెమెరాలు ..

సత్తుపల్లిటౌన్: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల పర్వం కొనసాగుతుంది. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్, ఎన్నికల అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపడుతుంది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రం నుంచి ఇప్పటికే నియోజకవర్గాల కేంద్రాలకు ఈవీఎంలు చేరుకున్నాయి. ఎంపిక చేసిన కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూంల్లో వీటిని భద్రపర్చగా మూడంచెల భద్రత ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లు ఇక్కడే..

సత్తుపల్లిలోని జ్యోతి నిలయం పాఠశాల భవనంలోని స్ట్రాంగ్‌రూంలో సత్తుపల్లి నియోజకవర్గంలో 291 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన 323 ఈవీఎం యంత్రాలు, 407 ఈవీప్యాడ్స్, 363 కంట్రోల్ యూనిట్స్, 363 బ్యాలెట్ యూనిట్లను భద్రపరిచారు. వైరా నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎం యంత్రాలను వైరాలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలోని స్ట్రాంగ్‌రూంలో ఏర్పాటు చేశారు. అలాగే, మధిర నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎం యంత్రాలను మధిర మండలంలోని ఖాజీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. ఈవీఎం యంత్రాలను ఇటీవల రిటర్నింగ్ అధికారులు, ఏఆర్‌ఓలు, పోలీస్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచి ఆయా గదులను సీజ్ చేశారు.

మూడంచెలుగా భద్రత..

స్ట్రాంగ్‌రూంల వద్ద పోలీస్ పహారా ఏర్పాటు చేశారు. లోపలికు వెళ్లేందుకు ఇతరులకు అనుమతించకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఉంది. స్ట్రాంగ్‌రూం భవనం ప్రాంగణంలో మూడు ఔట్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ భవనం సమీపంలో వాహనాలు నిలపకుండా రహదారి పక్కన స్థానిక పోలీసులతో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అలాగే, గేట్ వద్ద ఆర్మీ రిజర్వ్‌డ్ ఫోర్స్‌లో అవుట్ పోస్టు, స్ట్రాంగ్ భవనం చుట్టు ఇనుప ముళ్లతీగలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. భవనం చుట్టూ, లోపల, 20 సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంది. భవనం వద్ద సీఆర్పీఎఫ్ కేంద్ర సాయుధ బలగాలతో భవనం పైనా, కింద ఔట్ పోస్టులు ఏర్పాటు చేసి బలగాలు నిరంతర గస్తీ కాస్తున్నాయి.



స్ట్రాంగ్‌రూమ్ వద్ద కేంద్ర బలగాలు



ఆర్మీ రిజర్వ్‌డ్ ఫోర్స్ బందోబస్తు..

కట్టుదిట్టంగా బందోబస్తు..



స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచిన సత్తుపల్లి నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎం యంత్రాలు ఉన్న భవనానికి పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశాం. మూడు అంచెల భద్రతతో కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలతో కట్టుదిట్టంగా పహారా నిర్వహిస్తున్నాం. చుట్టపక్కల ఎవరూ ప్రవేశించటానికి వీలులేకుండా భద్రతను కట్టుదిట్టం చేశాం.

– బి.రామానుజం, ఏసీపీ, సత్తుపల్లి

అభివృద్ధి చేసి చూపిస్తా..



ప్రచారం నిర్వహిస్తున్న మదన్‌లాల్

కారేపల్లి: ఆదరించి ఓటేస్తే అభివృద్ధి చేసి చూపుతానని, తనను నమ్ముకున్న వారికి ఏ కష్టం వచ్చినా కాపాడుకుంటానని వైరా బీఆర్‌ఎస్ అభ్యర్థి బాణోతు మదన్‌లాల్ అన్నారు. బుధవారం మండలంలో ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్‌తో కలిసి ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే, సాధించుకున్న తెలంగాణ రాష్ట్రానికి మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను గెలిపించుకోవాలని, వలసపాలకుల చేతిలో రాష్ట్రాన్ని పెట్టొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు శకుంతల, జెడ్పీటీసీ వాంకుడోతు జగన్, మండలాధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్, వైఎస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరేందర్, ముత్యాల సత్యనారాయణ, అడ్డగోడ ఐలయ్య, హన్మకొండ రమేష్, తోటకూరి పిచ్చయ్య, ధరావత్ మంగీలాల్, ఎంపీటీసీలు జడల వసంత, ధర్మసోత్ శంకర్, ధరావత్ అచ్చమ్మ, జడల వెంకటేశ్వర్లు, అజ్మీర నాగేశ్వరరావు, గౌసుద్దీన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల మద్దతు కోరిన భట్టి



నాయకులతో మాట్లాడుతున్న భట్టి

బోనకల్: అసెంబ్లీ ఎన్నికలలో మధిర నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న తనకు తెలుగుదేశం పార్టీ మద్దతు ఇవ్వాలని మండల నాయకులను బుధవారం కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భట్టి విక్రమార్క మద్దతు తెలపాలని కోరారు. మండలాధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ, సాదినేని హనుమంతరావు, మరీదు బరకయ్య, సత్యనారాయణ, దీప్లా తదితరులు పాల్గొన్నారు.

భట్టి కుమారుడి ప్రచారం..

ఎర్రుపాలెం: మండలంలోని రేమిడిచర్ల, రామాపురం, కొత్తపాలెం గ్రామాల్లో బుధవారం సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తనయుడు మల్లు సూర్య విక్రమాదిత్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మధిర ఎమ్మెల్యేగా మరోసారి మల్లు భట్టి విక్రమార్కను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, పీసీసీ మెంబర్ శీలం ప్రతాపరెడ్డి, బండారు నర్సింహారావు, మల్లెల లక్ష్మణరావు, కోటపాటి రంగారావు, నాగిరెడ్డి శ్రీను, శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు వెంకటకృష్ణారావు, వేజండ్ల సాయి, గుడేటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఓటుకు నోటు సరికాదు

కొణిజర్ల: ఓటుకు నోటు తీసుకోవడం సరికాదని ప్రతీ విద్యార్థి గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీఓ కె.మహలక్ష్మి అన్నారు. మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు సీ విజిల్ యాప్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డబ్బులు పంచుతున్నట్లు సమాచారం ఉంటే యాప్‌లో ఫోటో తీసి అప్‌లోడ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యాన డాక్టర్ అవినాష్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ వాసవి, సూపర్‌వైజర్ విజయకుమారి, హెచ్ఎం చక్రపాణి, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు పలువురి రాజీనామా

కల్లూరు రూరల్: కల్లూరు మండలంలో బీఆర్‌ఎస్‌కు పలువురు నాయకులు బుధవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు పసుమర్తి చందర్‌రావు, నాయకులు పసుపులేటి శ్రీనివాసరావు, సిరసాని రాజు, హతిరాం, కాశిమళ్ల పురుషోత్తం,షేక్ యాఖుబ్‌అలీ రాజీనామా చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఏడుకొండలు, బీఆర్‌ఎస్ నాయకులు కాంతారావు, గుర్వయ్య కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలిపారు.

అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన



స్కోర్ కార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మధిర: మాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పారా సంస్థ ఆధ్వర్యంలో ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మహాత్మా గాంధీ హ్యూమన్ రైట్స్ క్లబ్ సభ్యులకు బుధవారం స్కోర్ కార్డులతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెరుపల్లి శ్రీహరి మాట్లాడుతూ... ఈ కార్యక్రమంలో వారి పాఠశాల, నివాస గ్రామంలో పేదరికం, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, మంచి ఆరోగ్యం, సంక్షేమం, పారిశుధ్యం, భూతాపం తదితర లక్ష్యాలపై అవగాహన పొంది వారి అభిప్రాయాలను స్కోర్ కార్డు ద్వారా తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్ మేడేపల్లి శ్రీనివాసరావు, సాయి కృష్ణమాచార్యులు, సంక్రాంతి శ్రీనివాసరావు, పారా స్టేట్ కోఆర్డినేటర్ ఎస్.నగేష్‌రావు, జిల్లా టీమ్ మెంబెర్ కటారపు ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

సత్తుపల్లి: స్థానిక చల్లగుళ్ల నర్సింహారావు నివాసం, క్యాంప్ కార్యాలయాల్లో బుధవారం చీఫ్ రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్, మలిరెడ్డి మురళీరెడ్డి, చల్లగుళ్ల నర్సింహారావు, నారాయణవరపు శ్రీనివాసరావు, కొత్తూరు ప్రభాకర్‌రావు, ఎండి ఫయాజ్ అలీ, జ్యేష్ఠ అప్పారావు, సుబ్బారెడ్డి, సతీష్‌రెడ్డి, ఎండి కమల్‌పాషా, చల్లారి వెంకటేశ్వరరావు, కరుణాకర్ పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ మెంబర్ శీలం ప్రతాపరెడ్డి, నాయకులు శ్రీనివాసరావు, శీలం శ్రీనివాసరెడ్డి, మల్లెల లక్ష్మణరావు, బండారు నర్సింహారావు, అనుమోలు కృష్ణారావు, దేవరకొండ రాజీవ్‌గాంధీ, గంటా తిరుపతమ్మ, షేక్ రజియా బేగం, కూరపాటి యశోద, శ్రీను, వేజండ్ల సాయి, జనార్ధన్ పాల్గొన్నారు.

సీపీఎంను గెలిపించాలి

ఎర్రుపాలెం: మధిర నియోజకవర్గ సీపీఎం అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ పోటీ చేస్తున్నారని, ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీఐటీయూ మండల ఆర్గనైజర్ సగుర్తి సంజీవరావు కోరారు. బుధవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు గామాసు జోగయ్య, నాయకులు నాగులవంచ వెంకట్రామయ్య, దూదిగం బసవయ్య, కోటి సుబ్బారెడ్డి, నక్కా పుల్లారావు, తదితరులున్నారు.

అమరులకు నివాళి

కొణిజర్ల: దోపిడీ రహిత సమాజ నిర్మాణమే అమర వీరులకు ఇచ్చే నిజమైన నివాళి అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ వైరా సబ్‌డివిజన్ కార్యదర్శి షేక్ ఖాసీమ్ అన్నారు. మండల కేంద్రం కొణిజర్లతో పాటు గుబ్బగుర్తి , విక్రమ్‌నగర్, రామనర్సయ్యనగర్ గ్రామాలలో అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా వర్ధంతి సభలు నిర్వహించారు. నాయకులు ఆంగోత్ బాషా, బాణోత్ కిషన్, పఠాన్ ఖాసీమ్ ఖాన్, బాలు, లచ్చన్న, కృష్ణ, రామలక్ష్మణుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బోనకల్: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమరుల పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై అంతులేని భారాన్ని మోపుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.గిరి, పెద్దప్రోలు వెంకటేశ్వర్లు, రవి, మంద రామారావు, సైదమ్మ, లక్ష్మయ్య, శ్రీను, సీతయ్య పాల్గొన్నారు.

నేలవాలిన వరి



ముదిగొండ: ముదిగొండ మండలంలోని మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి చేతికొచ్చిన వరిపంట నేలవాలింది. మండలంలోని మేడేపల్లి, యడవల్లి, గోకినేపల్లి, వెంకటాపురం గ్రామాల్లో వరిపంటలు నేలవాలాయి. ఈదురు గాలులతో వాన కురవడంతో పంటలు దెబ్బతిన్నాయి.

రాష్ట్రంలో రాబోయేది ఇందిరమ్మ రాజ్యమే..

- పీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ పొంగులేటి
- శ్రీనివాసరెడ్డి సమక్షాన కాంగ్రెస్‌లో పలువురి చేరిక



మాట్లాడుతున్న పొంగులేటి, పక్కన రాందాస్‌నాయక్ తదితరులు

వైరా/ఏన్కూరు/కారేపల్లి: రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇందిరమ్మ రాజ్యమేనని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏన్కూరుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, గార్లొడ్డు సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు బుధవారం పొంగులేటి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏన్కూరులో భారీ ర్యాలీ నిర్వహించగా, గార్లొడ్డు లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో పూజల అనంతరం సమావేశయ్యారు. ఈ సమావేశంలో వైరా కాంగ్రెస్ అభ్యర్థి మాలోత్ రాందాస్‌నాయక్.. శెట్టిపల్లికి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ కనీవినీ రీతిలో స్థానాలు గెలిచి అధికారంలోకి రానున్నందున కార్యకర్తలంతా విభేదాలు విడనాడి అవిశ్రాంతంగా కృషి చేయాలన్నారు. కాగా, అభ్యర్థి మాళోత్ రాందాస్‌నాయక్‌కు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీఫామ్ అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్‌తో పాటు పోట్ల నాగేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వరరావు, శెట్టి రంగారావు, లాలూనాయక్, కోసూరి శ్రీనివాసరావు, వెంకట నర్సిరెడ్డి, దానియేలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి పెరుగుతున్న వలసలు

వైరా నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నుంచి ప్రజాప్రతినిధులు పలువురు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. పొత్తులో భాగంగా సీపీఎంకు కేటాయిస్తారనే ప్రచారం జరిగినా, చివరకు కాంగ్రెస్ నేత మాలోత్ రాందాస్‌నాయక్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో బుధవారం ఒకేరోజే ఏన్కూరు, జూలూరుపాడు మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, వైరా మండలంలో పలువురు సర్పంచ్‌లు, ఇద్దరు మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. సింగరేణి మండల బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు, సొసైటీ డైరెక్టర్ తోటకూరి రాంబాబు సైతం భట్టివిక్రమార్క, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, రాందాస్‌నాయక్ సమక్షాన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



వైరారూరల్: కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



ముదిగొండ: కమలాపురంలో..

వైరారూరల్: ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వైరా ఏసీపీ ఎం.ఏ రెహమాన్ సూచించారు. మండలంలోని అష్టగుర్తి, గొల్లపూడి, సిరిపురం గ్రామంలో బుధవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించకుండా ప్రభుత్వ నిబంధనలను అనుసరించాలన్నారు. అనంతరం సార్వత్రిక ఎన్నికలపై గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ నునావత్ సాగర్, వైరా, కొణిజర్ల ఎస్సైలు మేడా ప్రసాద్, శంకర్ పాల్గొన్నారు.

ముదిగొండ: మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన వల్లభి, బాణాపురం, అయ్యగారిపల్లి, గంధసిరి, కమలాపురం, చిరుమర్రి, సువర్ణాపురం గ్రామాల్లో ఖమ్మం సీపీ ఆదేశాల మేరకు ముదిగొండ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో 50మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఏసీపీ రవి, ఖమ్మం రూరల్ సీఐ రాజిరెడ్డి, ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



యడవల్లిలో యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కమల్‌రాజు

ముదిగొండ: మూడో సారి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుందని, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని మధిర నియోజక వర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. ముదిగొండ మండలంలోని యడవల్లి శ్రీయోగానంద లక్ష్మీనరసింహాస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కమల్‌రాజుకు విజయోత్సవ ర్యాలీలో పూలతో, మేళతాళాలతో, మహిళల కోలాట భజనలతో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మధిర నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన అబివృద్ధి ఎన్నడూ లేదన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే చుట్టపు చూపులా వచ్చిపోతున్నాడే కానీ ప్రజల సమస్యలు పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జెడ్పీటీసీ పసుపులేటి దుర్గ, రైతు సమితి మండల కన్వీనర్ పోట్ల ప్రసాద్, మేడేపల్లి సొసైటీ చైర్మన్ సామినేని వెంకటేశ్వరరావు, నాయకులు ఎర్ర వెంకన్న, లక్ష్మారెడ్డి, వెంకట్‌గౌడ్, వాసు, పాము శిల్పరాజు, బ్రహ్మారెడ్డి, సీతారామయ్య, స్వాతి, బిక్షం, సర్పంచ్‌లు సామినేని రమేష్, ఓబినబోయిన అమరయ్య, జక్కార్, ఎంపీటీసీ చెరుకుపల్లి విజయ, నాగరాజు, శంకర్, బయ్యం రమేష్, పాల్గొన్నారు.

కమల్‌రాజ్ కుమార్తె ప్రచారం

ఎర్రుపాలెం: మధిర బీఆర్‌ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్‌ను గెలిపించాలని ఆయన కుమార్తె అభిజ్ఞ కోరారు. తన తండ్రి కమల్‌రాజ్ గెలుపును కాంక్షిస్తూ మండలకేంద్రంలో ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, మండల కమిటీ అధ్యక్షుడు పంబి సాంబశివరావు, ఎంపీపీ దేవరకొండ శిరీష, జెడ్పీటీసీ శీలం కవిత, సర్పంచ్ మొగిలి అప్పారావు, ఎంపీటీసీలు షేక్ మస్తాన్ వలీ, సగ్గుర్తి కిశోర్, మండల గుర్రాల పుల్లారెడ్డి, షేక్ బాబుసా, షేక్ హుస్సేన్, చిరంజీవి, రవి, పులి శిరీష, శ్రీను, ప్రభాకర్, తక్కెళ్లపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

మధిర: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్ అన్నారు. ఈనెల 11న హైదరాబాద్‌లో జరగబోయే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ ఆయన బుధవారం మర్లపాడు గ్రామంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ మధిర మండలాధ్యక్షుడు వేల్పుల పవన్ కళ్యాణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగ ఉపకులాల ఎస్సీల వర్గీకరణకు ఈ శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో చట్టబద్ధత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవదాసు, కొండూరు నాగేశ్వరరావు, సంగెపు పుల్లయ్య, కొంగల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో 8, మధిరలో 4 నామినేషన్లు



సత్తుపల్లి: నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మట్టా రాగమయి

సత్తుపల్లి: సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మట్టా రాగమయి తొలిసెట్టు నామినేషన్‌ను దాఖలు చేశారు. సీపీఎం అభ్యర్థులుగా మాచర్ల భారతి, కొలికపోగు సర్వేశ్వరరావు, సీపీఐ ఎంఎల్(ప్రజాపంథా) అభ్యర్థిగా బీరెల్లి లాజర్, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా కుక్కమూడి బాలప్రసాద్, ముదిగొల్ల చిన్న కృష్ణయ్య, ఈసెపల్లి రామారావు, పిరమిడ్ పార్టీ నుంచి ఆకుల పాల్‌లు నామినేషన్ దాఖలు చేశారు.

మధిరలో..

మధిర: మధిరలో 4 నామినేషన్లు దాఖలు అయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులుగా కళ్యాణం రమేష్, జంగం రామచంద్రయ్య, కొత్తపల్లి బాబు నామినేషన్లు వేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క తరపున జిల్లా కాంగ్రెస్ నాయకులు నాయుడు సత్యనారాయణ, సూరంశెట్టి నాగభూషణం నామినేషన్ దాఖలు చేశారు. వారి నామినేషన్లను స్థానిక తహసీల్ లో రిటర్నింగ్ అధికారి గణేష్ స్వీకరించారు.



మధిర: భట్టి తరఫున నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న నాయుడు సత్యనారాయణ